క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు : మండలంలో ప్రసిద్ధి చెందిన ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకటలాడింది. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



పొన్నపల్లిలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: పట్టణంలో ప్రధాన డ్రెయినేజీలను శుభ్రం చేసి పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో డ్రెయినేజీలను పరిశీలించారు. ప్రతిరోజూ డ్రెయినేజీలను శుభ్రం చేయడం ద్వారా దోమల సమస్యలుండవని చెప్పారు. ఇటీవల వర్షాల వల్ల ముంపునకు గురైన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా గుర్రం జాషువా పద్యపఠన పోటీలు



పద్యపఠన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా అంబేడ్కర్ ఆలోచనల వేదిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సన్‌షైన్ స్కూల్ ఆడిటోరియంలో విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఉపాధ్యాయురాలు తాడిమేటి కృష్ణవేణి, రవ్వుతుల రామ్మోహన్, తెలుగు ఉపాధ్యాయుడు నాగభూషణం లు వ్యవహరించారు. ఈ పోటీల్లో 20 పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 28న ఉదయం 10 గంటలకు స్థానిక సన్‌షైన్ స్కూల్ ఆడిటోరియంలో జరిగే గుర్రం జాషువా జయంతి సభలో బహుమతులను అందిస్తామని నిర్వాహకుడు, అంబేడ్కర్ ఆలోచనల వేదిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధీర్‌మోహన్ తెలిపారు.

వైభవంగా గరికపూజ



శివదేవునిచిక్కాలలో విఘ్నేశ్వరునికి గరికపూజ నిర్వహిస్తున్న అర్చక స్వామి

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి పురస్కరించుకుని విఘ్నేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, గరికతో పూజ నిర్వహించారు. సంకటహర చతుర్థి రోజున విఘ్నేశ్వరినికి పూజలు చేస్తే విద్య, ఉద్యోగం, వ్యాపారాలు వృద్ధి చెందుతాయని అర్చక స్వామి ర్యాలి శివాజీ భక్తులకు ఉపదేశం ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: సమసమాజం కోసం కాంక్షించిన మానవతావాది పిన్నమనేని ప్రతాప్ రాజు అని ఏబీఎస్‌వీకే ట్రస్టు చైర్మన్ బి.బలరాం అన్నారు. అల్లూరి సీతారామ రాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం విస్సాకోడేరు రావిచెట్టు వద్ద పిన్నమనేని ప్రతాప్‌రాజు వర్ధంతిని నిర్వహించారు. విస్సాకోడేరులో, మోగల్లు గుత్తులవారి పాలెంలో వృద్ధులకు, నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రీయ్య, నాయకులు దున్నా మరియమ్మ, గోపాలరాజు, ఖండవల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వరాల విజృంభణ

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న ప్రజలు
- ముందు జాగ్రత్తలు మేలంటున్న వైద్యులు



యలమంచిలిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో రోగులతో కిటకిటలాడుతున్న వార్డు

యలమంచిలి: వర్షాకాలం అంటేనే అంటు వ్యాధులకు అనుకూల కాలం. దానికి తోడు వరదలు కూడా రావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మురుగుడ్రెయిన్లతోపాటు ఇళ్ల పరిసరాలలో కూడా మురుగు నీరు నిల్వ ఉండిపోవడం, ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రతికూల వాతావరణం వల్ల ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా దోమకాటు వలనే అధిక జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు పటిష్ట పారిశుధ్య చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే జ్వరాలబారిన పడకుండా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. కొన్ని రకాల జ్వరాలు ప్రాణాంతకంగా మారతాయని జ్వరాన్ని సాధారణ జ్వరమే కదా అని తేలికగా తీసుకోకుండా సత్వర వైద్యం తీసుకోవడం చాలా ముఖ్యమని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న రోగులు

వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాలలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. రోజురోజుకీ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఎండ కాస్తూనే వర్షం కురవడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులు అధికంగా వస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రైవేట్ ఆసుపత్రులు కూడా రోగులతో కిటకిటలాడుతున్నాయి. వర్షాకాలంలో బురద ప్రభావం వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగీ, బోదకాలు, మెదడువాపు వంటి ప్రాణాంతక వ్యాధులు అధికంగా వస్తున్నాయి.

ఇంటింటికీ వెళ్లి అవగాహన

గ్రామాలలో సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే చేస్తూనే పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత గురించి వివరిస్తున్నారు. ఇంటితో పాటు ఇంటి పరిసరాలను, రోడ్లను శుభ్రంగా ఉంచడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా ముఖ్యమని చెబుతున్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచిస్తున్నారు. వర్షాకాలం కావడంతో సూపర్ క్లోరినేషన్ చేసిన నీటినే కుళాయిల ద్వారా సరఫర చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. బురదగా ఉన్న చోట బ్లీచింగ్ చల్లేలా చర్యలు తీసుకుంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే

- వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, తాగేసిన కొబ్బరిబొండాలు, రుబ్బురోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- తినే ఆహారం, తాగే నీరు కలుషితం కాకుండా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- కాచి చల్లార్చి, వడగట్టిన నీటినే మాత్రమే తాగాలి.
- ఆహారం తీసుకునే ముందు, మల విసర్జన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడగాలి.
- దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచాలకు దోమ తెరలు, కిటికీలు, గుమ్మాలకు దోమల మెస్‌లు వేసుకోవాలి.
- ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే వారి శరీరం పూర్తిగా కప్పి ఉండేలా దుస్తులు వేయాలి.

వేగంగా వైద్య సేవలు..



జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో వచ్చే రోగులందరికీ సత్వర వైద్యం అందిస్తున్నాం. ఈ లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి రక్త పరీక్షలు చేయిస్తున్నాం. అవసరమైన వారికి సెలైన్స్ పెడుతున్నాం. రోగాలబారిన పడకుండా ఉండాలంటే ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రోగులకు సూచిస్తున్నాం.

– డాక్టర్ వర్ధనపు సుభాష్‌చంద్ర స్వరూప్, వైద్యాధికారి యలమంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెనుమంట్రలో ఉచిత ధ్యాన శిక్షణ



పెనుమంట్రలో శాకహార ర్యాలీ బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: స్థానిక బ్రహ్మర్షి పత్రీజి పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉమాచంద్ ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, ఆనందం రెండూ డబ్బుతో కొనలేనివని శాకాహారం ద్వారా ఆరోగ్యాన్ని ధ్యానసాధన ద్వారా ఆనందాన్ని పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో భూపతిరాజు వెంకట శ్రీనివాసరావుజు, సాయిగీత, జిల్లా పీఎస్ఎస్ఎం అధ్యక్షులు రుద్రరాజు పెద్దివర్మ, జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పారిశుద్ధ్య సిబ్బందికి మెడికల్ క్యాంపు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు ఈ నెల 23,24 తేదీల్లో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, పారిశుద్ధ్య కార్మికులకు అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని స్పష్టం చేశారు.

ఆకట్టుకున్న నాణేలు, స్టాంపుల ప్రదర్శన



స్టాంపులు, నాణేల వివరాలను తెలుసుకుంటున్న డాక్టర్ బాబ్జి తదితరులు

పాలకొల్లు సెంట్రల్: సమాజంలో నేటి యువతరానికి పురాతనమైన వస్తులపై అంతగా అవగాహన లేదని ఇటువంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థులు పురాతన వస్తువులు వాటి వినియోగంపై అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో యూత్ హాస్టల్స్ పాలకొల్లు శాఖ 32వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన నాణేలు, స్టాంపుల ప్రదర్శన స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనను ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు వచ్చి తిలకించే విధంగా ఆయా పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ప్రదర్శన నిర్వాహకులు అందరూ సుమారు 50 నుండి 60 ఏళ్ల వయస్సు పైబడిన వారేనని అన్నారు. నేటి యువతరంతో పాటు భవిష్యతరాల ప్రజలకు కూడా పురాతన వస్తువులపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి వాటిని సేకరించి ఇలా ప్రదర్శనగా పెట్టడం అభినందనీయమన్నారు. పాలకొల్లుకు చెందిన కంచర్ల రాజేష్ ప్రపంచ దేశాలకు చెందిన బంగారం, వెండి, రజత నాణేలు, కారుమూరి సురేఖ ప్రత్యేకంగా ఏనుగులతో ఉన్న అనేక రకాల స్టాంపులు, అనకాపల్లికి చెందిన కొణతాల శ్రీనివాసరావు ఒకే నెంబర్‌తో ఉన్న నోట్లు, అమలాపురానికి చెందిన పుత్స కృష్ణ కామేశ్వరరావు 243 దేశాల కరెన్సీ నోట్లును ప్రదర్శనలో ఉంచారు.చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కారుమూరి వెంకట నరసింహారావు, యూత్ హాస్టల్స్ సభ్యులు కారుమూరి సూర్యనారాయణ, కొట్టు భాస్కరరావు, నూలి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు మంగళసూత్రాల సమర్పణ



దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామ దేవత శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి తూర్పుగోదావరి జిల్లా గూడపల్లి గ్రామానికి చెందిన పిల్లి నరేంద్ర, దుర్గా హనుమ కుమారి దంపతులు ఆదివారం నాలుగు గ్రాముల బంగారు మంగళ సూత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆగమప్రవర సుదర్శనం శ్రీనివాసాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మెడలో నూతన మంగళ సూత్రాలు అలంకరించారు. దాతలు అమ్మవారికి మంగళ సూత్రాలతో పాటు చలివిడి పానకాలు, పసుపు, కుంకుమ, గాజులు, చీర సమర్పించారు. బంగారు సూత్రాలు సమర్పించిన దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాసరావు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

గ్రామాల్లో నిమజ్జనోత్సవ సందడి



సిద్ధాంతంలో ఆకట్టుకున్న గారడీ నృత్యం



పెనుగొండలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

పెనుగొండ: గణపతి నిమజ్జనోత్సవాలు పెనుగొండ మండలంలో కొనసాగుతున్నాయి. ఆదివారం సిద్ధాంతం కాలవకాడ కమిటీ కుర్రోళ్ల ఆధ్వర్యంలో నిర్వహించి నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో నిమజ్జనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన పురాతన గారడీ నత్యం ఆకట్టుకుంది. బుట్టబొమ్మల నృత్యాలు, శక్తి రూపాలు, విచిత్ర వేషాలు ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవం అనంతరం కేదారీఘాట్ వద్ద వశిష్టా గోదావరిలో నిమజ్జనం చేశారు. అలాగే పెనుగొండలో లింగాల వీధి, శ్రీరామ్ నగర్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జనోత్సవాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం నరసాపురం కాలువలో నిమజ్జనాలు చేశారు.

ఏచూరి, ఆర్ఎస్‌లకు ఘన నివాళి



పాలకొల్లు సమతా భవన్‌లో ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మతాలను రాజకీయాలకు ముడిపెట్టకూడదని పోరాడిన వ్యక్తి కామ్రేడ్ సీతారామ్ ఏచూరి అని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని సమతా భవన్‌లో సీపీఎం జాతీయ నేత కామ్రేడ్ సీతారామ్ ఏచూరి, మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ ఎస్) మృతికి ఎస్ఎఫ్ఐ ఎక్స్‌లెంట్ టీమ్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు డి.అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి నిరంతరం అండదండగా ఉద్యమాలు చేసిన వ్యక్తులు సీతారామ్, ఆర్ఎస్‌లు అని వారి సేవలను కొనియాడారు. అలాగే ఇటీవల మృతి చెందిన వలవల శ్రీరామమూర్తి, ఎ.సత్తిరాజులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో తొట్టెంపూడి కోటేశ్వరరావు, యర్రా అజయ్‌కుమార్, చల్లా సోమేశ్వరరావు, టి.అప్పాజీ, కన్నబాబు, జెసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్ట్

పెనుగొండ: మండలంలోని చెరుకువాడ బల్రెంకలాంబ ఆలయం సమీపంలో పేకాట స్థావరం పై నిర్వహించిన దాడిలో పేకాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొన్నట్లు పెనుగొండ ఎస్సై కే గంగాధర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం సమాచారం రావడంతో దాడి చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.54,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులను ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని కోరారు.

ఘనంగా అఖండ అన్నసమారాధన



భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న మేడపాటి షర్మిలారెడ్డి

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలో నరసాపురం కాలువగట్టుపై ఉన్న శ్రీవిద్యగణపతి ఆలయం వద్ద ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామంలో 21 మంది దాతల స్వామివారికి సమర్పించిన 21 రకాల వంటకాలను అన్నసమారాధనలో భక్తులకు వడ్డించారు. సుమారు 8 వేల మందికిపైగా భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచంట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి శ్రీవిద్యాగణపతిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొవ్వూరి బ్రహ్మేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, ఎంపీటీసీ సభ్యుడు గుడిమెట్ల లక్ష్మణ్‌రెడ్డి, కొవ్వూరి బాబ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మకు ఆత్రేయపురానికి చెందిన హర్షవర్మ నాగసాయి దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది ప్రసాదం , రసీదును అందజేశారు.

రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ సెలెక్షన్లు

నరసాపురం రూరల్: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలెక్షన్లు ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంఈఓలు పిల్లి పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్‌లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల విద్యార్థులు ఈ సెలెక్షన్లకు హాజరు కావచ్చుని పేర్కొన్నారు. 24న బాలికలకు, 25న బాలురకు ఎల్బీచర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ సెలక్షన్లు ఉంటాయని స్పష్టం చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో జరిగే ఈ సెలెక్షన్లకు వ్యాయామోపాధ్యాయుడు అడపా రామకృష్ణ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

నిలిచిన లైబ్రరీ నిర్మాణ పనులు



కాటన్‌పార్కు వద్ద నిలిచిపోయిన గ్రంథాలయ నిర్మాణ పనులు



అద్దె భవనంలో ఉన్న నరసాపురం శాఖ గ్రంథాలయం

- రూ.1.18 కోట్లతో మూడంతస్తుల భవన నిర్మాణానికి చర్యలు
- కూటమి ప్రభుత్వంలో పూర్తిగా నిలిచిపోయిన పనులు

నరసాపురం: పట్టణంలో కాటన్‌పార్కు వద్ద చేపట్టిన గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో శాఖా గ్రంథాలయానికి సొంత భవనం సమకూరాలన్న లక్ష్యం నెరవేరేలా కనిపించడంలేదు. 2023 జనవరిలో గ్రంథాలయ నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ద్వారా 1.28 కోట్లు మంజూరు చేసింది. దీంతో అదే ఏడాది ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచన మేరకు రైల్వేస్టేషన్‌రోడ్డులోని కాటన్‌పార్కు వద్ద 25 సెంట్లు మున్సిపల్ స్థలాన్ని గ్రంథాలయం కోసం కేటాయించారు. దీంతో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న నరసాపురం గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటు కాబోతుందని అందరూ భావించారు. అయితే ప్రభుత్వం మారిన తరువా పనులు అర్ధాంతంగా నిలుపుదల చేశారు. 1954లో నరసాపురంలో గ్రంథాలయం స్థాపించారు. ప్రస్తుతం గ్రేడ్–1 గ్రంథాలయంగా కొనసాగుతోంది. ఇప్పటికీ ఈ గ్రంథాలయానికి ప్రతిరోజూ 200 మంది వరకూ రీడర్స్ వస్తారు. అయితే అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య గ్రంథాలయంలో సేవలు కొనసాగుతున్నాయి.

లైబ్రరీ నిర్మాణ పనులు పూర్తి చేయాలి



నరసాపురం లైబ్రరీ పురాతనమైనది. మున్సిపాలిటీ ఏర్పడక రెండేళ్లముందే ఇక్కడ లైబ్రరీ ఏర్పాటుచేశారు. ఇప్పటి వరకూ సొంత భవనం లేకపోవడం బాధాకరం. దీన్ని దృష్టిలో పెట్టుకుని లైబ్రరీ భవనానికి మున్సిపాలిటీకు చెందిన స్థలాన్ని కేటాయించాము. అప్పటి ఎమ్మెల్యే ముదునూరి నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టించారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఆగిపోయిన లైబ్రరీ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయించాలి.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

సమస్య మళ్లీ మొదటికి..

సొంత భవనం సమకూరుతాదనుకుంటే సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయ్యిందని రీడర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా టీడీపీ హయాంలో నిధులు అందుబాటులో ఉన్నా కూడా కనీసం స్థల సేకరణపై కూడా అప్పటి పాలకులు దృష్టి పెట్టలేదు. దాదాపు 70 ఏళ్ల సమస్యకు ముదునూరి ప్రసాదరాజు పరిష్కారం చూపించారు. ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయి సమస్య అలాగే ఉంది.

ఆచంట వేమవరంలో సామూహిక సీమంతాలు



ఆచంట వేమవరంలో సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకొన్న సందర్భంగా నిర్వహిస్తున్న మంచి ప్రభుత్వం కార్యక్రమంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆదివారం ఆచంట మండలం ఆచంట వేమవరంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొని లోగోను ఆవిష్కరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.అలాగే పోడూరు మండలం పండిత విల్లూరులో ఆదివారం మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ యిళ్ల లక్ష్మీ చందిక, ప్రత్యేకాధికారి జీ వెంకట సూర్యనారాయణ, శివయ్య, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.